### శోధయాత్ర అంటే సంతృప్తి:

దెందులూరు: రెండు ఇడ్లీ ఇవ్వమ్మా ఫస్ట్. రెండు చాలు, అన్నాను. ఆ అమ్మాయి మరియు వాళ్ళ అమ్మ కలిసి ఆ చిన్న టిపిన్ బండి నడుపుతున్నారు. రెండు చెట్నీలూ సూపర్ ఉన్నాయి. దోసె వాసన నన్ను టెంప్ట్ చేసింది. ఒక్క దోసె వెయ్యండి, అని పురమాయించాను. ఒక దోసె రెండు చట్నీలు. అద్భుతమైన రుచి. ఇంకో దోసె తినకుండా ఆపుకోలేక పోయాను. ఎంత అయింది, అని అడిగాను. పదిహేను రూపాయలు అన్నది ఆమె. ప్లేట్ పదిహేనా అని అడిగా. కాదు అన్ని కలిపి పదిహేను అన్నది. ఎంత ఒక దోసె అన్నా. ఐదు రూపాయలు ఒక దోసె అని జవాబు. అవాక్కవటం నా వంతు. మళ్ళీ అడిగాను, ఈ మధ్య చెవుడు వచ్చిందేమో అని. మళ్ళీ అదే సమాధానం, అన్ని కలిపి పదిహేను రూపాయలు అని. సంపాదన కోసం కాక, కేవలం జరుగుబాటు కోసం పని చేసే స్వచ్ఛమైన మనసులు. కక్కుర్తి పడకుండా క్వాలిటీ రుచితో చేసే తల్లి వంటి చేతులు. ఇలాంటి అనుభవాలు చిన్న శోధయాత్రలోనే సాధ్యం.

### శోధయాత్ర అంటే జ్ఞానధార:

మొదటి రోజు యాత్రలో రాత్రి బస ఒక ఫాం హౌస్ లో. మరునాడు ఉదయం ఆ ఫాం హౌస్ నిర్వాహకుడు శ్రీ విజయ్ సారధి గారి నుండి అపారమైన జ్ఞాన ప్రసారం. అనుభవం స్థితప్రజ్ఞత కొట్టొచ్చినట్లు కనిపించింది వారి మాటల్లో. భాష, స్పష్టత, ఓపిక, అవగాహన, ఇవన్నీ కలిపి ఎంత బాగా మాట్లాడారో. వక్క చెట్లు, కోక్ చెట్లు, వెనీలా తీగలకు కాయలు, మిరియాల తీగలు, పచ్చి బుజ్జి మిరియాల రుచి, అన్ని కలిపి, కొంగ్రొత్త జ్ఞానం. అనుభవజ్ఞుల పరిచయం చిన్న శోధయాత్రలోనే సాధ్యం.

### శోధయాత్ర అంటే ప్రకృతిలో పరవశం:

అల రోడ్డు పక్కన నడుంవాల్చి, ఆకాశంలో మబ్బులు, నక్షత్రాలు చూస్తూ, పెద్దలు చెప్పే మాటలు వింటూ, పైరగాలి పీలుస్తూ, మూడు రోజులపాటు తిరగటమే. సగం రోజు అంతా ఎటు చూసినా పైరులు, పచ్చదనం. ఆ తరువాత ఎత్తైన పామ్ వృక్షాలు, మధ్యలో పంటకాలువవు, ఫాం హౌస్ లు, కొలనులు, బోరింగుల నుండి ధారగా నీళ్ళు. ఆ ప్రకృతి అందాలు ఆస్వాదిస్తూ కళ్ళలో నింపుకుంటూ, కబుర్లు చెప్పుకుంటూ, ఒక ఊరి నుండి ఇంకో ఊరికి సహయాత్రికులతో నడక. వాగుల్లో స్నానాలు. తోటల్లో భోజనాలు. ప్రకృతి కాంత పరిచయం చిన్న శోధయాత్రలోనే సాధ్యం.

### శోధయాత్ర అంటే పల్లె జీవిత సారం:

రోడ్డు పక్కన ఒక పెద్దాయన కూర్చుని గేదెలు మేస్తూంటే కాపలా కాస్తున్నాడు. ఆయనతో మాట కలిపాను. ఎన్ని బాబాయ్ గేదెలు అని, 20 ఉన్నాయి అని సమాధానం చెప్పాడు అతను. నెలకు కనీసం 25 వేల నుండి 50 వేల వరకూ గేదెలపై సంపాదస్తున్నాడు. ఐదు ఎకరాల పొలం కూడా ఉంది, పామాయిల్ తోట. ఒక కొడుకు ఆస్ట్రేలియాలో జాబ్. ఇంకో కొడుకు ఇక్కడ వ్యవసాయం చూస్తుంటాడు. మరి నీకు ఎందుకు బాబాయ్ ఈ కష్టం అంటే అనుభవం అంతా విరిసేలా ఒక నవ్వు నవ్వి వెళ్లిపోయాడు. ఇలా ఊరూరా రైతులు, పశువుల కాపరులు, బ్యాగులు రిపేరు చేసేవారు, మోటర్లు రిపేరు చేసేవారు, అన్ని రకాలు వృత్తులవారు ఎంతో మందిని పలకరిస్తూ, బాబాయ్ అని, అన్నా అని మాట కలుపుతూ వారి జీవితానుభవాలు, పల్లె జీవితాలు తెలుసుకొంటూ సాగిపోవటం చిన్న శోధయాత్రలోనే సాధ్యం.

### శోధయాత్ర అంటే విజ్ఞానం, సైన్స్, సృజనాత్మకత, కామన్ సెన్స్:

నాగ శ్రీనివాస్ అనే ఇన్నోవేటర్ గారిని కలిసాము. 6-7 రకాల ఇన్నోవేషన్ ఉన్నాయి వారు కనిపెట్టినవి. చదువు నాలుగోతరగతి. అపారమైన సృజనాత్మక తృష్ణ. మాకు అవన్నీ వివరించారు. ఎంతో వినయవంతుడు. మిగతా యాత్ర అంతా

ఒక ఎత్తు, ఒక ఇన్నోవేటర్ ని కలిసాము అనే అనుభవం ఒక ఎత్తు. చదువుకు సంబంధం లేని సృజనాత్మకత ఎలా సాధ్యం, అంటే ఏమిటి, అనేది తెలుస్తుంది. ఈ ప్రాధమిక పరిజ్ఞానం చిన్న శోధయాత్రతోనే సాధ్యం.

## శోధయాత్ర అంటే నాయకత్వం మరియు శిష్యత్వం, ఒక బాణం రెండు పిట్టలు:

యాత్ర ప్రారంభంలో పరిచయ కార్యక్రమం. యాత్ర నియమ నిబంధనలు తెలియచేయడం. దిశా నిర్దేశం. దారి పొడుగునా ఇన్నోవేటర్ల స్టోరీలు చెప్పడం. సందేహాలు తీర్చడం. అందరినీ కనిపెట్టి ఉండటం. ఇంకా భోజనం తదితర ఏర్పాట్ల పర్యవేక్షణ. ఇవన్నీ కాక ప్రతి మొక్క గురించి, ఆకు గురించి, చెట్టు గురించి అపారమైన విజ్ఞానం ఆయన సొంతం. అంజిరెడ్డి గారు ఇంతకు ముందు కాలేజీ నడిపారు. ఆ బోధనానుభవం మాకు పనికి వచ్చింది వారి వద్ద మా సందేహాలు తీర్చుకోటానికి. దరిమిలా మొత్తంమీద గొప్ప నాయకత్వం అంజిరెడ్డి గారిది. అంజిరెడ్డిగారు, బ్రిగేడియర్ వంటివారు స్వయంగా తామే గొప్ప జ్ఞాన వృక్షాలు. నాయకత్వ లక్షణాలు తెలుసుకోవటం, నాయకత్వ శిక్షణ ఇవ్వకనే ఇవ్వడం చిన్న శోధయాత్రతోనే సాధ్యం.

## శోధయాత్ర అంటే వైవిధ్యం, స్నేహం:

ఒకరు స్కూలు పిల్లాడు. ఇంకొకరు స్కూల్ టీచర్. ఇంకా చాలామంది ఐటి ఉద్యోగులు, ఇంకా చాలామంది వ్యవసాయం చేస్తున్నవారు, ఇంకా యాత్రరంగంలో వారు, మొత్తం దాదాపు ముప్పైమంది వివిధ రంగాలవారు ఒకచోట కలిసారు. అందులో నలుగురు మహిళా యువతులు కూడా. ఇంతమంది కలిసి గ్రామాల నుండి ఏమైనా నేర్చుకోవాలి అని బయలు దేరాము. ఇంతమంది వివిధ రంగాలవారు, వయసులవారితో కలిసి, నడుస్తూ నడుస్తూ కబుర్లు చెప్పుకొంటూ, ఒకరి గురించి ఒకరు తెలుసుకొంటూ వారి వారి విజ్ఞానం, విద్య, జీవితానుభవాలు పంచుకొంటూ, అడిగి తెలుసుకొంటూ, మూడు రోజుల పాటు మైండ్స్ ట్యూన్ చేసుకుంటూ. ఇంత వైవిధ్యభరితమైన ఏకలక్ష్యం చిన్న శోధయాత్రలోనే సాధ్యం.

**ఇన్ని విధాల, ఇంకా ఎన్నో విధాల వ్యక్తిత్వ వికాసం, మనోల్లాసం, సమాజ శ్రేయస్సు, అన్నీ కలిపి బహుళార్థసాధకం చిన్నశోధయాత్ర.**

